ఆందోళన చేస్తున్న విద్యార్థులు

గురుకుల హాస్టల్లో ఉండలేం

- వసతుల్లేవ్.. నీళ్లు రావు
- స్కూల్లో టీచర్లు లేరు..
- సెలబస్ ఎప్పుడు పూర్తి చేస్తరో
- వెంకటాపూర్ గురుకుల పాఠశాల
- విద్యార్థుల ఆందోళన
- మూడున్నర కిలోమీటర్లు నడిచివెళ్లి..
- మంథని-కాటారం ప్రధాన రహదారిపై ధర్నా

మంథని రూరల్, ఏప్రిల్ 8: పెద్దపల్లి జిల్లా మంథని మండలం వెంకటాపూర్ లోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు రోడ్డెక్కారు. హాస్టల్‌లో కనీస సౌకర్యాలు లేక, స్కూల్లో ఉపాధ్యాయులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని 7,8,9వ తరగతి పిల్లలు ఆందోళన చేశారు. సోమవారం ఉదయం 6 గంటలకే హాస్టల్ నుంచి దాదాపు 100 మంది బయటికి వచ్చి మూడున్నర కిలో మీటర్ల దూరం వరకు నడుచుకుంటూ వెళ్లి వెంకటాపూర్ క్రాస్ వద మంథని-కాటారం ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడారు. హాస్టల్, స్కూల్లో మరుగుదొడ్ల సక్రమంగా లేవని, కనీస సౌకర్యాలు కరువయ్యాయని వాపోయారు. నీళ్ల ప్రాబ్లం ఎక్కువగా ఉండడంతో అందరికీ ఎలర్జీ అవుతున్నదని, ఈ విషయాన్ని ఉపాధ్యాయులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. అన్ని సబ్జెక్టులకు సరైన ఉపాధ్యాయులు లేరని, ఇప్పటికీ సెలబస్ పూర్తి కాలేదని ఇలా అయితే తమ చదువులు ఎలా అని ప్రశ్నించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా ఉపాధ్యాయులు తమను బెదిరిస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని, గురుకులాన్ని వెంకటాపూర్ నుంచి వేరే చోటుకి మార్చాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ వెంకటకృష్ణ సంఘటన స్థలానికి చేరుకొని విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

ఒక్క వసతి లేదు..

నేను ఏడో తరగతి చదువుతున్న. హాస్టల్ కనీస సౌకర్యాలు లేవు. నీళ్లు కూడా వస్తలేవు. వచ్చిన కొద్దిపాటి నీళ్లు శుద్ధమైనవి కాకపోవడంతో స్కిన్ ఎలర్జీ వస్తోంది. మాకు ఈ సమస్య ఉంది..? ఆరోగ్యం బాగాలేదని చెప్పినా సార్లు మమ్మల్ని దవాఖానకు కూడా తీసుకుపోరు. మరుగుదొడ్లు కూడా సక్రమంగా లేవు. హాస్టల్‌లో ఉండలేకపోతున్నాం. ఇప్పటికైనా మా సమస్యలు పరిష్కరించాలి. హాస్టల్ వెంకటాపూర్ నుంచి వేరే మంచి చోటుకు మార్చాలి.

- సంజీవ్, 7వ తరగతి విద్యార్థి

టీచర్లు లేరు.. సెలబస్ పూర్తి కాలె..

నేను 8వ తరగతి చదువుతున్న. టీచర్ల కొరత ఉంది. సెలబస్ పూర్తి కాలేదు. ఇంకా మా హాస్టల్‌లో వసతులు సక్రమంగా లేవు. మరుగుదొడ్లు లేక, నీరు సక్రమంగా రాక నరకం చూస్తున్నాం. మాకున్న ఇబ్బందులను మా సార్లు, టీచర్లకు చెప్పితే వారు పట్టించుకోరు. మా హాస్టల్‌కు వచ్చే పెద్ద సార్లకైనా మా బాధలు చెప్పుదామంటే.. మమ్మల్ని కలువనిస్త లేరు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలి. మా సమస్యలు పరిష్కరించి మంచి విద్యాబోధన అందించాలి.

- భూమేశ్, 8వ తరగతి విద్యార్థి

మోటర్ల దొంగ అరెస్టు చూపుతున్న పోలీసులు

మోటర్ల దొంగ దొరికిండు

- గుంపుల వద్ద అరెస్ట్
- 20 మోటర్లు, టీవీఎస్ ఎక్సెల్ బండి స్వాధీనం
- జల్సాలకు బానిసై దొంగతనాలు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ కృష్ణ

ఓదెల, ఏప్రిల్ 8: కొన్నిరోజులుగా సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, పొత్కపల్లి ఠాణాల పరిధిలో వ్యవసాయ బావుల వద్ద మోటర్లు ఎత్తుకెళ్తున్న నిందితుడు ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. జల్సాలకు బానిసై మోటర్లు దొంగలిస్తూ కేవలం ₹2వేలు – ₹3వేలకు విక్రయిస్తూ రైతులను ముంచుతున్న కేటుగాన్ని కటకటాల్లోకి నెట్టారు. పెద్దపల్లి ఏసీపీ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కాల్వశ్రీరాంపూర్ మండలం మీర్జంపేట అనుబంధ గ్రామం కొత్తపల్లి గ్రామానికి చెందిన గోపు సంపత్ కరంట్ మోటర్లు, చిల్లర దొంగతనాలకు అలవాటు పడ్డాడు. రాత్రి వేళ ఎస్సారెస్పీ కాల్వలు, మానేరు వాగుల వెంట తిరుగుతూ రైతులు పంటలు పండించుకోవడానికి పెట్టుకున్న కరంట్ మోటర్లను దొంగిలిస్తున్నాడు. ఒక్కొక్కటి దొంగలించి ఇంటి వద్ద పోగు చేశాడు. సోమవారం కరంట్ మోటర్‌ను తన టీవీఎస్ ఎక్సెల్‌పై పెట్టుకోని అమ్ముకు వచ్చే క్రమంలో గుంపుల మానేరు బ్రిడ్జి వద్ద వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులకు చిక్కాడు. అతనిని విచారించగా ఇంటి వద్ద 20 కరంట్ మోటర్లు ఉన్నట్లు వెల్లడించగా, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సంపత్‌కు 25 ఏండ్లుగా నేర చరిత్ర కల్గి ఉందని, గతంలో జైలుకు వెళ్లి వచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయని తెలిపారు. రైతులు పంటలకు సాగు నీరందక అష్టకష్టాలు పడుతూ కాల్వలు, వాగులలో మోటర్లు పెట్టుకుంటే దోపిడీ గురికావడంతో ఇన్ని రోజులు ఆందోళన చెందారు. ఎట్టకేలకు దొంగ దొరకడంతో ఊపిరి పీల్చుకున్నారు. సమావేశంలో సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐలు ఓంకార్‌యాదవ్, అశోక్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు. దొంగను పట్టుకోవడంలో ప్రతిభచూపిన ఏఎస్ఐలు రత్నాకర్,తిరుపతి,హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్, కానిస్టేబుల్ రాజేందర్, శ్రీనాథ్, శ్రవణ్‌ను ఏసీపీ అభినందించారు.

రాబోయే ఎన్నికల్లో కార్మికులు బీజేపీకి ఓటేయొద్దు

గోదావరిఖని, ఏప్రిల్ 8: బీజేపీ ప్రభుత్వం చేసిన చట్టంతో సింగరేణిలో కొత్త గనులు రావడం లేదని, పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పిలుపునిచ్చారు. ఆర్జీ–1 జీడీకే–11వ గనిలో సోమవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కేంద్ర ఉపాధ్యక్షుడు ఎల్ ప్రకాశ్, ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోచంతో కలిసి ఆయన మాట్లాడారు. సింగరేణిలో పదేళ్లుగాకొత్త గనులు రావడం లేదన్నారు. పాత గనులను మూసివేసి ఓసీపీలుగా మారుస్తున్నారని ఆరోపించారు. కొత్త గనులు రావాలంటే, చట్టంలో మార్పులు జరగాలంటే బీజేపీకి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. గోదావరిఖనిలో రోడ్డు వెడల్పు పేరుతో కార్మికుల క్వార్టర్లు తొలగించకూడదని, ఏదైనా చట్ట ప్రకారం చేయాలని, అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని కార్మికులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మోదుగుల సంపత్, రంగు శ్రీనివాస్, వెంకటరెడ్డి, నరేశ్, రాజు, రాజేశ్వరరావు, ఇనుముల రాజమౌళి తదితరులున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్

పెద్దపల్లి, ఏప్రిల్8: జిల్లాలో నిర్దేశించిన లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో యాసంగి 2023–24 ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ..నాణ్యమైన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని, మంగళవారం లోగా 305 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు.

రైస్ మిల్లులలో అదనపు కలెక్టర్ తనిఖీలు

సుల్తానాబాద్‌రూరల్,ఏప్రిల్ 8: మండలంలోని కాట్నపల్లి సాయి సరస్వతీ, బొంతకుంటపల్లిలోని నందిని, స్రవంతి రైస్ మిల్లులను అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వానకాలం–2023కు సంబంధించి రైస్ మిల్లింగ్ ప్రక్రియ సకాలంలో పూర్తి చేస్తూ ఎప్పటికపుడు ఎఫ్‌సీఐకి రైస్ డెలివరీ చేయాలని, పూర్తి సామర్థ్యం మేరకు రైస్ మిల్లులను నడపాలని సూచించారు. సకాలంలో నిర్దేశించిన లక్ష్యం మేరకు రైస్ డెలివరీ పూర్తి చేయాలని ఆదేశించారు. రైస్ మిల్లుకు కేటాయించిన ధాన్యం, సరఫరా చేసిన బియ్యం, రైస్ మిల్లులో అందుబాటులోఉన్న ధాన్యం, తదితర వివరాల రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో సమావేశంలో జిల్లా సహకార అధికారి శ్రీమాల, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, డీఆర్‌డీవో కే.రవీందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ రూరల్ : రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్

కాల్వశ్రీరాంపూర్ : వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు

ధర్మారం : రచ్చపల్లి ప్రభుత్వ పాఠశాలలో

విద్యాసంస్థల్లో ముందస్తు ఉగాది వేడుకలు

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉగాది వేడుకల్లో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పెద్దపల్లిరూరల్, ఏప్రిల్ 8: మండలంలోని పెద్ద బొంకూర్ మదర్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాల, పెద్దకల్వలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముందస్తు ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాలల్లో ఉగాది పచ్చడి చేశారు. ఉగాది ప్రత్యేకతను వివరిస్తూ అందరికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ లక్ష్మీనర్సయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు. పెద్దపల్లి మండలంలోని కాసులపల్లి ట్రినిటీ పాఠశాలలో, అప్పన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో వేడుకలు జరిపారు.

ముదస్తు ఉగాది సంబరాలు

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 8: కాల్వశ్రీరాంపూర్ లోని వేదవ్యాస ఉన్నత పాఠశాలలో ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. కరస్పాండెంట్ ఉమామహేశ్వర్ పండుగ విశిష్టతను వివరించారు.

ధర్మారం,ఏప్రిల్8: రచ్చపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. పాఠశాలలో షడ్రుచుల పచ్చడి తయారు చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

ముస్లింలతో కలిసి ప్రార్థన చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, ఏప్రిల్ 8: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసన సభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మంథని మున్సిపల్ కార్యాలయ ఏరియాలో సోమవారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ విందులో మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ముస్లిలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు యుశాచేశారు. పాటు ఉపవాసాలు చేపట్టిన ముస్లింలతో దీక్షలు విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ఎంతో భక్తి శ్రద్ధలతో నియమ నిష్టలతో ఉపవాస దీక్షలు చేస్తారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ముస్లీంలు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

పట్టణంలోని కూరగాయల మార్కెట్ ఏరియా సమీపంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమా సురేశ్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోమ వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారిని మంత్రి అభినందించారు.

మైనర్ బాలికపై దాడి చేసిన వృద్ధుడి ఘటనలో అరెస్ట్

ధర్మారం,ఏప్రిల్22: మండలంలోని ఓ గ్రామంలో మైనర్ బాలిక (6)పై లైంగిక దాడి చేసిన వృద్ధుడిని పోలీసులు అరెస్ట్ చేశారు.స్థానిక ఎస్ఐ టీ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం ఓ గ్రామంలో బాలిక ఇంటి ముందు ఒంటరిగా ఆడుకుంటుండగా బొడిగె రాజయ్య (70) లైంగిక దాడి చేశాడు. విషయం తెలిసిన బాలిక తల్లిదండ్రులు చికిత్స చేయించి నిందితుడిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో నిందితుడు రాజయ్యను సోమవారం అరెస్ట్ చేసి కోర్టుకు రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

ఓఆర్ ఎస్ ప్యాకెట్లు అందజేత

ముత్తారం, ఏప్రిల్ 8: వేసవి దృష్ట్యా ఉపాధి హామీ కూలీలు జాగ్రత్తలు పాటించాలని ముత్తారం కార్యదర్శి సంతోష్ సూచించారు. ఉపాధి హామీలో పనిచేస్తున్న కూలీలకు ఆయన సోమవారం ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు.

ప్రియుడు పెళ్లికి నిరాకరించడంతో యువతి ఆందోళన

ధర్మారం,ఏప్రిల్8: ప్రేమ పేరిట వెంట పడిన యువకుడు పెళ్లికి నిరాకరించడంతో ఓ యువతి ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించింది. బాధిత యువతి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం తిర్యాని గ్రామానికి చెందిన బద్ధం సౌమ్య (26), ధర్మారం మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన నల్లా శ్రీనివాస్ రెడ్డి కి మూడేళ్ల క్రితం కరీంనగర్‌లో పరిచయం ఏర్పడింది. ఇద్దరిది ఒకే సామాజికవర్గం కావడం, యువతికి ఆ యువకుడు బావ వరుస కావడంతో ఇద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. వీరిద్దరూ కరీంనగర్‌లోని ఓ ఇంటిని అద్దెకు తీసుకుని సహజీవనం చేశారు. పెళ్లికి ముందే యువతికి ప్రెగ్నెన్సి కావడంతో అబార్షన్ చేయించాడు. పెళ్లి చేసుకోవాలని యువతి ఒత్తిడి చేసింది. పట్టించుకోవడంతో గత నెల 15న కరీంనగర్‌లోని వన్‌టౌన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. పెళ్లి జరిపిస్తామని పెద్దలు హామీ ఇచ్చారు. కాగా సదరు యువకుడు సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేయటంతో యువతి సోమవారం నర్సింగాపూర్‌లోని శ్రీనివాస్ రెడ్డి ఇంటి బైఠాయించింది. విషయం తెలుసుకున్న ధర్మారం –2 ఎస్ఐ అశ్విని యువకుడి బంధువులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈనెల 14 వరకు గడువు ఇవ్వాలని యువకుడి బంధువులు కోరడంతో ఆందోళన విరమించింది. తనను ప్రేమించిన యువకుడితో పెళ్లి జరిపించిచే దాకా ఆందోళన కొనసాగిస్తానని బాధిత యువతి వెల్లడించింది.

వరకట్నం, హత్య కేసులో భర్త, అత్తకు జీవిత ఖైదు

ఫర్టిలైజర్‌సిటీ, ఏప్రిల్ 8: ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్న యువతిని వరకట్నం కోసం వేధించి హతమార్చి ఆత్మహత్యగా చిత్రీకరించిన కేసులో గోదావరిఖని కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. ఆమె భర్త, అత్తకు జీవిత ఖైదు విధించింది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం..

పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని ఎల్‌బీనగర్‌కు చెందిన బీనవేని గౌతమిని హనుమాన్‌నగర్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి బిస్సా రాజు 2009లో కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నారు. కొన్నాళ్ల పాటు వీరి కాపురం సజావుగా సాగింది. అయితే గౌతమిని భర్త రాజు, అత్త బిస్సా దుర్గమ్మ వరకట్నం కోసం వేధించారు. గౌతమి తండ్రి కొన్నేళ్లుగా సింగరేణిలో ఉద్యోగం చేస్తుండగా, విరమణ పొందే క్రమంలో వచ్చే డబ్బులో నుంచి రూ.10లక్షలు తేవాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో 2014 ఆగస్టు 9న గౌతమిని ఆమె అత్త దుర్గమ్మ, భర్త రాజు గొంతి నులిమి హత్య చేశారు. సాక్షాలు తారుమారు చేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు గౌతమిపై కిరోసిన్ పోసి నిప్పంటించారు. గౌతమి తండ్రి ఐలయ్య ఫిర్యాదు మేరకు అప్పటి గోదావరిఖని వన్‌టౌన్ సీఐ సీహెచ్ శ్రీధర్ 498ఎ, 302, 304బీ సహా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అప్పటి గోదావరిఖని ఏసీపీ, ప్రస్తుత వైజాగ్ జాయింట్ సీపీ ఫకీరప్ప కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ ఆఫీసర్ సీఎంఎస్ ఇన్‌చార్జి కొత్తకొండ శంకర్ కోర్టులో 28మంది సాక్షులను ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో అదనపు జిల్లా న్యాయస్థాన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ టీ జ్యోతిరెడ్డి ప్రాసిక్యూషన్ తరపున తన వాదనలు వినిపించారు. సాక్షాధారాలను పరిశీలించి, నేరం రుజువు కావడంతో నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ న్యాయమూర్తి శ్రీనివాసరావు తీర్పునిచ్చారు.

ప్రభుత్వ దవాఖానలో ప్రసవాల సంఖ్య పెంచాలి

ముత్తారం, ఏప్రిల్ 8: ప్రభుత్వ దవాఖానలో ప్రసవాల సంఖ్య పెంచేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో అన్నప్రసన్న సిబ్బందికి సూచించారు. ముత్తారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆమె సందర్శించారు. అనంతరం ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో సమావేశమై మాట్లాడా రు. ఆరోగ్య రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఏఎన్ఎంలు, ఆశ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇక్కడ వైద్యాధికారి అమరేందర్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీపీసీ మసీదులో ఇఫ్తార్

జ్యోతినగర్, ఏప్రిల్ 8: ఎన్టీపీసీ 23 డివిజన్‌లోని ఏ జబల్ మసీదులో సోమవారం సాయంత్రం ఇఫ్తార్ ఏర్పాటు చేయగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ హాజరయ్యారు. ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థన చేశారు. ముస్లింలకు ముందస్తుగా రంజాన్ శుభకాంక్షలు తెలిపారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

ఫర్టిలైజర్‌సిటీ, ఏప్రిల్ 8: గోదావరిఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముస్లిం న్యాయవాదులకు కోర్టు కాంప్లెక్స్ ఆవరణలో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తౌటం సతీశ్, ప్రధానకార్యదర్శి జవ్వాజి శ్రీనివాస్, సీనియర్ న్యాయవాదులు సంజయ్‌కుమార్, కిషన్‌రావు, భూమయ్య, ఉమర్ సలీం, మహిళ ముస్లిం న్యాయవాదులు ఉన్నారు.



డ్రైఫ్రూట్ తినిపిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

ఇసుక రీచ్ లు రద్దు చేయాలి

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 8: మండలంలోని మీర్జంపేట, కిష్టంపేట, మొట్లపల్లిలో ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ లను రద్దు చేయాలని ఆ గ్రామస్తులు సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌లతో ఇష్టారాజ్యంగా ఇసుక తోడేస్తుండడంతో భూగర్భజలాలు అడుగంటిపోయి, పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల బాధలను గుర్తించి వెంటనే ఇసుక రీచ్ లు రద్దు చేయాలని విన్నవించారు.

విరాళం అందజేత

సుల్తానాబాద్‌రూరల్, ఏప్రిల్ 8 : మండలంలోని సుద్దాలలో రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి రూ.25 వేల విరాళాన్ని ఆదర్శ విరాజ్ బిల్డర్స్ ప్రతినిధులు బూరుగు సత్యనారాయణ గౌడ్, రాజన్న గౌడ్, పడాల అజయ్ గౌడ్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రేణుకాఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్టీపీసీ లేబర్‌గేట్‌లో విరాళాల సేకరణ

జ్యోతినగర్, ఏప్రిల్ 8: కులవివక్ష పోరాట సమితి సామాజిక ఉద్యమ నిధి కోసం ఎన్టీపీసీ లేబర్‌గేట్‌లో సోమవారం రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేపట్టారు. విధులకు వెళ్తున్న ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మికులకు నుంచి రూ. 3,398 నగదు విరాళంను సేకరించిన నాయకులు సీఐటీయూ జిల్లా కమిటీకి అందజేయనున్నట్లు తెలిపారు. ఉద్యమ నిధికి సహకరించిన కార్మికులకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శి లక్ష్మారెడ్డి, నాంసాని శంకర్, నాయకులు కే రాజ్‌కుమార్, కే మల్లేశ్, ఎండీ యాకూబ్, సీమెచ్ పోచయ్య, కే శ్రీనివాస్, ఏ భూమయ్య, శ్రీనివాస్, బీ వెంకన్న, భాస్కర్, తదితరులు ఉన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

రామగిరి, ఏప్రిల్ 8: రామగిరి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మండల సాధారణ సర్వసభ్య సమావేశం సభ్యుల గైర్హాజరుతో వాయిదా పడింది. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం కావల్సి ఉండగా, సభ్యులు రాకపోవడంతో ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు ప్రకటించారు. నిర్ణీత సమయానికి ఒకే ఒక్క ప్రాదేశిక సభ్యుడు కొప్పుల గణపతి వచ్చారు. ప్రజల సమస్యలను అధికారుల ముందు ప్రస్తావించి, పరిష్కారానికి చొరవ చూపాల్సిన ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడంపై వారి చిత్తశుద్ధిని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎంపీడీవో శైలజ రాణి, ఎంపీవో సమ్మిరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కూలీ డబ్బులు చెల్లించాలని మహిళల ధర్నా

జీపీ కార్యాలయంలో ఆందోళన చేస్తున్న మహిళా కూలీలు

ముత్తారం, ఏప్రిల్ 8: తాము చేసిన పనులకు సంబంధించిన కూలి డబ్బులు చెల్లించాలంటూ మండలంలోని ఖమ్మంపల్లి పంచాయతీ కార్యాలయం ఎదుట మహిళా కూలీలు సోమవారం ధర్నాకు దిగారు. ఖమ్మంపల్లి పంచాయతీ ప్రత్యేక అధికారి హరికృష్ణ, ఇన్‌చార్జి కార్యదర్శి రాకేశ్ గ్రామ సభ ఏర్పాటు చేయగా మహిళా కూలీలు ఆందోళన చేశారు. 100 రోజులు చేసిన పనులకు గాను మొత్తం రూ. 40వేలు రావాల్సి ఉందని, దీనిపై పంచాయతీ రికార్డుల్లో కూడా నమోదు చేశార చెప్పారు. దీనిపై గ్రామ పంచాయతీ కార్యదర్శి రాకేశ్‌ను వివరణ కోరగా ట్రెజ రీ నుంచి డబ్బులు డ్రా చేయలేదనారు. పంచాయతీలో ఉప సర్పంచ్ అవిశ్వాసం, సర్పంచ్ పదవీ కాలం ముగియడం ఆపై ప్రత్యేక అధికారులు నియమితులు కావడంతో చెల్లింపులో జాప్యమైందని వివరించారు. త్వరలోనే డబ్బులు చెల్లిస్తామని అధికారులు హామి ఇవ్వడంతో మహిళలు ధర్నా విరమించారు.

ఇసుక డంప్ సీజ్

మంథని రూరల్, ఏప్రిల్ 8: మండలంలోని గుంజపడుగు శివారులోని కాశిపేట గుడి ఆవరణలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను రెవెన్యూ అధికారులు సోమవారం సీజ్ చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇసుకను అక్రమంగా డంప్ చేసి ఉంచడంతో ఆర్ఐ రాజిరెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. 25 ట్రిప్పుల ఇసుకను సీజ్ చేశారు.

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం.. మంథని వాసి మృతి

మంథని, ఏప్రిల్ 8: మంథని పట్టణంలోని రావుల చెరువు కట్టలోని విశ్వబ్రాహ్మణ వీధికి చెందిన వెలకంటి మారుతి (40)అనే వ్యక్తి హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మంథనికి చెందిన మారుతి హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తూ భార్యతో కలిసి అక్కడే జీవిస్తున్నాడు. ఉగాది పండుగ సందర్భంగా తన భార్య మంథనికి పంపించేందుకు కూకట్‌పల్లి వద్ద బస్సు ఎక్కించి వెళ్తుండగా ప్రమాదవశాత్తు మరో బస్సు ఆయనను ఢీ కొట్టింది. వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలించగా మారుతి మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మారుతి మృతితో పట్టణంలోని రావుల చెరువుకట్టలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బీజేపీకి ఓటేస్తే ప్రజాస్వామ్యానికి ప్రమాదమే

కోల్‌సిటీ, ఏప్రిల్ 8: రాబోయే ఎన్నికల్లో బీజేపీ పార్టీకి ఓటేస్తే ప్రజాస్వామ్యానికి ప్రమాదం తప్పదని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ధర్మేంద్ర అన్నారు. గోదావరిఖని భాస్కరరావు భవన్‌లో సోమవారం జిల్లా అధ్యక్షుడు మానస్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓట్ల కోసం బీజేపీ మతోన్మాద ఆటను తీవ్రతరం చేస్తుందని, మత విద్వేషాలు రెచ్చగొట్టి మూడోసారి అధికారంలోకి వచ్చేందుకు పావులు కదుపుతోందన్నారు. హిందువుల ఓట్లను కొల్లగొట్టందుకు రాజకీయాలను అంటకడుతోందన్నారు. సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి లింగం రవి, మార్కపురి సూర్య తాళ్లపల్లి సురేందర్, ఆసాల నవీన్, సాదుల శివ, దుర్గం విజయ్‌కుమార్, పవన్, ప్రీతం, రానవేణి సుధీర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

పాలకుర్తి, ఏప్రిల్ 8: పాలకుర్తి మండలం కుక్కలగూడూర్ గ్రామంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐకేపీ ఏపీఎం సదానందం ప్రారంభించారు. గ్రామంలోని రైతులు ప్రభుత్వకొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు, మహిళలు పాల్గొన్నారు.

అంతర్గాంలో నూకాంబిక అమ్మవారి జాతర

అంతర్గాం, ఏప్రిల్ 8: అంతర్గాం టీటీఎస్‌లో సోమవారం నూకాంబిక(పోచమ్మ) అమ్మవారి జాతర నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ప్రభుత్వ సలహాదారుడు హర్కర వేణుగోపాల్‌రావు అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. జాతర కమిటీ ఆధ్వర్యలో వేణుగోపాల్‌రావుకు జ్ఞాపిక అందజేసి సన్మానించారు.